



# స్టార్ త్రినేత్రం

PRGI NO: TGTEL/25/A0438

అనుక్షణం అక్షరసత్యం

తెలుగు దినపత్రిక






| వరంగల్ | సంపుటి:1 | సంచిక -32 | ఎడిటర్ : డీ శివకృష్ణ | ఆదివారం 29 జూన్ 2025 | పేజీలు 4 | వెల : రూ. 2 |
|---|---|---|---|---|---|---|
| WARANGAL | VOL-1 | ISSUE-32 | Editor: D.SHIVAKRISHNA | SUNDAY 29 JUNE 2025 | Pages:4 | Price: 2 |


## హైదరాబాద్ అభివృద్ధి దిశగా
# దూసుకెళ్తున్నాం

- 2029లో శేరిలింగంపల్లిని నాలుగు నియోజకవర్గాలుగా విభజించనున్నాం
- పీజేఆర్ సేవలు అపూర్వం, జంటనగరాల దాహార్తి తీర్చిన ఘనత ఆయనదే
- కంచగచ్చిబౌలిలో ఐటీ హబ్ రూపుదిద్దుకోనుంది, లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశాలు
- హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ
- సీఎం రేవంత్ రెడ్డి




**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్, :** 2029లో తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోందని, ఈ క్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం నాలుగు విడి నియోజకవర్గాలుగా మారబోతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. శనివారం ప్రారంభమైన పీజేఆర్ ఫ్లైఓవర్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నగర అభివృద్ధి కోసం ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు సాగుతోందని తెలిపారు. పీజేఆర్ చేసిన సేవలు వెలకట్టలేనివని, హైదరాబాద్‌కు గోదావరి, కృష్ణా నదుల నీటిని తీసుకొచ్చిన? ఆయనదేనని కొనియాడారు. ఆయన నివాసం ఒకప్పుడు 'జనతా గ్యారేజ్'లా ఉండేదని గుర్తు చేశారు. పీజేఆర్ పేరుతో నిర్మించిన ఫ్లైఓవర్‌ను రూ.182.72 కోట్ల వ్యయంతో కొండాపూర్-గచ్చిబౌలి మార్గంలో 1.2 కిలోమీటర్ల పొడవుతో ఆరు లైన్లతో నిర్మించామని చెప్పారు. ఇది గచ్చిబౌలి చౌరస్తాలో ట్రాఫిక్ బాధను తక్కువ చేస్తుందని తెలిపారు. కంచగచ్చిబౌలిలో అభివృద్ధి ఆటంకాలు తాత్కాలికమని, ఐటీ కంపెనీలు వస్తే 5 లక్షల ఉద్యోగాలు కలుగుతాయని సీఎం పేర్కొన్నారు. నగర అభివృద్ధికి ఎవరైనా అడ్డుపడితే సహించమని, ఎన్నికలవరకే రాజకీయాలు, ఆ తర్వాత అభివృద్ధే ధ్యేయమని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కాలుష్యరహితంగా మార్చడంలో ప్రభుత్వం ముందడుగు వేసిందని సీఎం తెలిపారు. నగరంలో ఇకపై డీజిల్ బస్సులు ఉండవని, వాటిని జిల్లాలకు తరలించి, హైదరాబాద్‌లో 3,000 ఎలక్ట్రిక్ బస్సులను నడిపేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాలపై

➤ మిగతా 2వ పేజిలో..

## పసుపు బోర్డు కార్యాలయం
# నిజామాబాద్ రైతుల గర్వకారణం

- ఎంపీ ధర్మపురి అర్వింద్
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 29న కార్యాలయ ప్రారంభానికి విచ్చేస్తున్నారు
- నిజామాబాద్ రైతుల సంక్షేమానికి బిజెపి కృషి స్పష్టమవుతోంది
- పసుపు బోర్డు వలన గిట్టుబాటు ధరలు, ఎగుమతులకు గ్రీన్ సిగ్నల్
- ప్రధాని మోడీ నాయకత్వంలో దేశ వ్యాప్తంగా అభివృద్ధి పథం స్పష్టమవుతోంది



**స్టార్ త్రినేత్రం, నిజామాబాద్, :** పసుపు బోర్డు స్థాపన, అదే జిల్లాలో కార్యాలయ ఏర్పాటుతో నిజామాబాద్ రైతులు గర్వించదగిన విజయాన్ని సాధించారని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఈ కార్యాలయాన్ని జూన్ 29వ తేదీన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. ఆదివారం ఉదయం 11:25 గంటలకు ఆయన గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరి, మధ్యాహ్నం 1 గంటకు హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమీపంలోని హెలిప్యాడ్‌కు రాగా, అనంతరం వినాయక్‌నగర్‌లో జాతీయ పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభానికి వెళ్లనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభోత్సవం జరగనుంది. 2:30 గంటల వరకు కార్యాలయంలో ఉండనున్న ఆయన, ఆపై 2:35 గంటలకు కంటేశ్వర్ క్రాస్ రోడ్‌లో డి. శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. 2:45 నుంచి 4 గంటల వరకు పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో నిర్వహించే కిసాన్ మహా బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని ఢిల్లీకి తిరిగి వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ, బిజెపి రైతుల సంక్షేమం కోసం నిబద్ధతతో పని చేస్తోందని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర

➤ మిగతా 2వ పేజిలో..

## ఉద్దానం పేజ్ -2 మంచినీటి పథకానికి శంకుస్థాపన

- ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం
- శంకుస్థాపనలో కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు
- ఉద్దానం ప్రాంతానికి నాణ్యమైన తాగునీటి లభ్యత
- మహిళల కోసం ఉచిత బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభం



**స్టార్ త్రినేత్రం, శ్రీకాకుళం, :** ప్రభుత్వాన్ని విమర్శించినందుకే పథకాలను నిలిపేయడం వంటి రాజకీయం కూటమి ప్రభుత్వానికి దూరమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో పర్యటించిన ఆయన, పాతపట్నం నియోజకవర్గంలోని

➤ మిగతా 2వ పేజిలో..

## రా చీఫ్‌గా పరాగ్ జైన్ నియామకం

- జులై 1 నుంచి బాధ్యతలు
- ప్రస్తుత చీఫ్ రవి సిన్హా పదవీకాలం ముగియడంతో కేంద్ర నిర్ణయం
- పంజాబ్ క్యాడర్‌కు చెందిన 1989 బ్యాచ్ ఐపీఎస్ అధికారి

**స్టార్ త్రినేత్రం, న్యూఢిల్లీ, :** భారత రహస్యబలగాల కీలక విభాగమైన 'రిసెర్చ్ అండ్ ఎనాలసిస్ వింగ్ (రా)'కి కొత్త చీఫ్‌గా పంజాబ్ క్యాడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పరాగ్ జైన్ నియమితులయ్యారు. ప్రస్తుత రా చీఫ్ రవి సిన్హా పదవీకాలం ఈ నెల 30తో ముగియనుండటంతో, కేంద్ర ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. శనివారం నియామకాలపై ఉన్న క్యాబినెట్ కమిటీ ఉత్తర్వులు జారీ చేస్తూ, జులై 1వ తేదీ నుంచి పరాగ్ జైన్ రా చీఫ్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్లు వెల్లడించింది. ఈ పదవిలో ఆయన రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. పరాగ్ జైన్ 1989 బ్యాచ్‌కు చెందిన పంజాబ్ క్యాడర్ ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం ఏవియేషన్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అత్యంత గోప్యంగా చేపట్టిన పాకిస్థాన్‌పై భారత ఆపరేషన్ 'సిందూర్'లో పరాగ్ జైన్

➤ మిగతా 2వ పేజిలో..

## పూరి రథయాత్రలో
# తొక్కిసలాట కలకలం

- 625 మందికి గాయాలు, పలువురి పరిస్థితి విషమం
- మహిళలు, చిన్నారులు, జర్నలిస్టులు సైతం గాయపడినవారిలో
- వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న భక్తులు
- బాధితుల సంరక్షణకు సీఎం మోహన్ చరణ్ మాఝీ ఆదేశాలు

**స్టార్ త్రినేత్రం, భువనేశ్వర్,** లయంలో జరిగిన రథయాత్ర ఉత్సవంలో తీవ్ర తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో సుమారు 625 మంది భక్తులు గాయపడినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. వారిలో చాలా మంది మహిళలు, చిన్నారులు

➤ మిగతా 2వ పేజిలో..

# దేశానికి అభివృద్ధి తెచ్చేది కాంగ్రెస్ పాలనే

- బీజేపీకి తొత్తులుగా మారిన కూటమి, వైసీపీపై విమర్శల వర్షం
- రాష్ట్రానికి హామీలు విస్మరించిన కేంద్రంపై తీవ్ర ఆగ్రహం
- షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ బలోపేతం దిశగా రాష్ట్ర పర్యటన
- సూపర్ సిక్స్, ఉచిత బస్సు వంటి హామీలు నిర్వర్తించని ప్రభుత్వం
- వైఎస్ షర్మిల

**స్టార్ త్రినేత్రం, కాకినాడ, :** దేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ పాలనే అత్యవసరమని, అదే ప్రజల సంక్షేమానికి గమ్యమని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. బీజేపీ అన్యాయ పాలనకు తెరదించాలంటే కాంగ్రెస్ బలోపేతం అవసరమని, తాము రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ పార్టీని పటిష్ఠం చేస్తున్నామన్నారు. కాకినాడలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆమె, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పుష్పాంజలి అర్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, టీడీపీ, జనసేన, వైసీపీ పార్టీలు బీజేపీకి తొత్తుల్లా మారిపోయాయని విమర్శించారు. విభజన హామీల అమలులో విఫలమైన కేంద్రానికి ఈ పార్టీలు సహకరిస్తూ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. గతంలో చంద్రబాబు, ఇప్పుడు కూటమిగా కలిసి బీజేపీకి అండగా నిలుస్తున్నారని, జగన్ కూడా బీజేపీ మెడలు వంచుతానని చెప్పి చివరికి తలవంచి, వారి విధానాలకు మద్దతుగా పనిచేశారని మండిపడ్డారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఎప్పుడూ బీజేపీకి భజన చేయలేదని, జగన్ వ్యవహారం ఆయన పరువు తీసినట్టేనని విమర్శించారు.



ప్రధానమంత్రి మోడీ ఇప్పటివరకు రాష్ట్రానికి రాజధాని, పోలవరం, విశాఖ ఉక్కు కర్మాగారం వంటి కీలక అంశాల్లో ఏదీ స్పష్టంగా చెప్పలేదని షర్మిల అన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో ఉపయోగించాలంటే 45 మీటర్ల ఎత్తు అవసరమని

➤ మిగతా 2వ పేజిలో..

## కోల్‌కతా లా కాలేజీ సామూహిక
# అత్యాచార కేసులో సెక్యూరిటీ గార్డు అరెస్ట్

- బాధితురాలి సహాయ విన్నపాలను పట్టించుకోని గార్డు
- ప్రధాన నిందితుడు సహా నలుగురు అరెస్టులో
- కాలేజీ పరిధిలోనే జరిగిన దారుణ ఘటన

**స్టార్ త్రినేత్రం, కోల్‌కతా, :** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన దక్షిణ కోల్‌కతా లా కాలేజీలోని సామూహిక అత్యాచార ఘటనలో తాజాగా సెక్యూరిటీ గార్డును పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికే మూడు మంది నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు, బాధితురాలిని నిరాశ్రయ స్థితిలో వదిలిన గార్డు నిర్లక్ష్యం కారణంగా చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. జూన్ 25న ఈ దారుణం చోటుచేసుకున్నప్పుడు సెక్యూరిటీ గార్డు కాలేజీ క్యాంపస్‌లోనే ఉన్నాడు. బాధితురాలు పలుమార్లు అతన్ని సహాయం కోసం పిలిచి విన్నవించినా, అతడు స్పందించకుండా గదిలో నుంచి వెళ్లిపోయినట్టు పోలీసులు వెల్లడించారు. అంతేకాదు, ఘటన అనంతరం అధికారులకు ఫిర్యాదు చేయకుండా మౌనం పాటించాడు. పోలీసులు అతని నిర్లక్ష్యం స్పష్టంగా ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా తృణమూల్ కాంగ్రెస్ ఛాత్ర విభాగం మాజీ ప్రెసిడెంట్ మోనోజిత్ మిశ్రా ఉన్నాడు. అతడితో పాటు జైబ్ అహ్మద్ (19), ప్రమిత్ ముఖర్జీ అనే ఇద్దరు యువకులు ఈ నేరానికి సహకరించినట్టు విచారణలో తేలింది. ముగ్గురిని ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారు. బాధితురాలి ప్రకటన ప్రకారం, రాత్రి కాలేజీ ప్రధాన గేట్‌ను లాక్ చేసిన అనంతరం, సెక్యూరిటీ గార్డును గదికి వెలుపల కూర్చోబెట్టి, ఆమెను గదిలో బంధించి అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన వెలుగులోకి రాగానే విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు తీవ్రంగా స్పందిస్తూ కాలేజీ యాజమాన్యంపై, భద్రతా

➤ మిగతా 2వ పేజిలో..

వరంగల్ | సంపుటి:1 | సంచిక -32 | ఎడిటర్ : డీ శివకృష్ణ | ఆదివారం 29 జూన్ 2025 | పేజీలు 4 | వెల : రూ. 2

WARANGAL | VOL-1 | ISSUE-32 | Editor: D.SHIVAKRISHNA | SUNDAY 29 JUNE 2025 | Pages:4 | Price: 2



# హైదరాబాద్ అభివృద్ధి దిశగా దూసుకెళ్తున్నాం

**మొదటిపేజీ తరువాయి..** పన్ను మినహాయింపునిస్తూ ఉత్సాహపరుస్తున్నామని పేర్కొన్నారు. ఆటోలు కూడా ఎలక్ట్రిక్ లేదా సిఎన్‌జి మోడళ్లకు మారాలని చెప్పారు. నగరంలోని నాలాలు, చెరువుల కబ్జాలను హైడ్రా యంత్రాల సహాయంతో తొలగిస్తున్నామని చెప్పారు.
బతుకమ్మకుంటను కబ్జా చేసిన వారివద్దనుంచి ప్రభుత్వం తిరిగి తీసుకున్నదని, ఇదే నిజమైన పాలన అంటారు అని సీఎం రేవంత్ చెప్పారు. నగరానికి పెరుగుతున్న ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి శ్రీధర్‌బాబును ఇన్‌చార్జి మంత్రిగా నియమించామని చెప్పారు.
ఇదిలా ఉండగా, మెట్రో విస్తరణ, మూసీ ప్రాజెక్టులకు కేంద్రం సహకరించకపోవడం బాధాకరమన్నారు. రేపు రాష్ట్రానికి వచ్చే అమిత్ షాతో ఈ విషయంపై మరోసారి చర్చిస్తామని వెల్లడించారు. హైదరాబాద్ అభివృద్ధికి కలసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. తాను ఇప్పటివరకు దాదాపు 35సార్లు ఢిల్లీ వెళ్లినప్పటికీ, రాష్ట్రానికి కేంద్రం నుంచి చెప్పుకోదగ్గ ప్రాజెక్టులు రాలేదని అన్నారు. కేంద్రం ఏం ఇచ్చిందని కిషన్‌రెడ్డి వంటి బీజేపీ నేతలు ప్రజలకు చెప్పగలరా అని ప్రశ్నించారు.
హైదరాబాద్‌ను ఇతర మహానగరాలతో పోల్చుతూ, ఢిల్లీ కాలుష్యంలో శ్వాస తీసుకోవడం కష్టమైందని, చెన్నై, బెంగళూరుల్లో వర్షం వస్తే నగరాలు అతలాకుతలమవుతున్నాయని, వాటినుండి పాఠాలు నేర్చుకోవాలని అన్నారు. హైదరాబాద్‌లో వర్షపు నీరు వెళ్లే మార్గాలను కబ్జాలు చేసినందువల్లే ముంపు సమస్యలు తీవ్రమవుతున్నాయని తెలిపారు. అక్రమ నిర్మాణాలను కూల్చడం ద్వారా నగరాన్ని ముంపు సమస్యల నుంచి రక్షిస్తున్నామని స్పష్టం చేశారు.
కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ క్యాలెండర్ ఎందుకు అమలు చేయరు

**నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి**

**4న నిరుద్యోగుల చలో సచివాలయానికి బిఆర్‌ఎస్ మద్దతు**

**పోస్టర్‌ను ఆవిష్కరించిన బిఆర్‌ఎస్ నేత హరీష్ రావు**

హైదరాబాద్, : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్న జాబ్ క్యాలెండర్ ఎందుకు అమలు చేయడం లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ అమలు చేయకపోవడంతో నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని జూలై 4వ తేదీన ఛలో సచివాలయం సమ్మెకు నిరుద్యోగులు పిలుపునిచ్చారని తెలిపారు. నిరుద్యోగుల ఛలో సచివాలయం సమ్మెకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. ఈ సందర్భంగా హలో నిరుద్యోగి, ఛలో సెక్రటేరియట్ సమ్మె పోస్టర్‌ని హరీష్‌రావు శనివారం తెలంగాణ భవన్‌లో విడుదల చేశారు. అనంతరం మీడియాతో హరీష్‌రావు మాట్లాడారు. నిరుద్యోగుల ఛలో సచివాలయం సమ్మెకి సీపీఎం పార్టీ మద్దతు ఇచ్చినట్లు నిరుద్యోగులు చెప్పారని పేర్కొన్నారు హరీష్‌రావు. బీఆర్‌ఎస్ హయాంలో 95 శాతం ఉద్యోగాలు తెలంగాణ బిడ్డలకే దక్కేలా మాజీ సీఎం కేసీఆర్ చొరవ తీసుకున్నారని హరీష్‌రావు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామన్న జాబ్ క్యాలెండర్‌లో ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయడం లేదని.. నిరుద్యోగులు ఆందోళనలో ఉన్నారని చెప్పుకొచ్చారు. ఇది జాబ్ క్యాలెండర్ కాదు.. జాబ్ లెస్ క్యాలెండర్. ఇది దగా క్యాలెండర్ అని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఏడాదికి లక్ష ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ నిరుద్యోగులకు హామీ ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 12 వేల ఉద్యోగాలకు మించి ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. ఎన్నికల సమయంలో ఇందిరమ్మ మనమరాలుగా మాట ఇస్తున్నానని ప్రియాంకాగాంధీ యూత్ డిక్లరేషన్ ఇచ్చారని హరీష్‌రావు గుర్తుచేశారు. యూత్ డిక్లరేషన్‌లో చెప్పిన ఐదు అంశాలను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీ ఎందుకు నెరవేర్చలేదని హరీష్‌రావు ప్రశ్నించారు. స్కూటీ అంటే తనకు ఇష్టమని చెప్పిన ప్రియాంకాగాంధీ, మహిళ స్టూడెంట్స్‌కి ఇస్తామన్న స్కూటీ ఎందుకు ఇవ్వడం లేదో సమాధానం చెప్పాలని నిలదీశారు. నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రియాంక గాంధీ చెప్పారని.. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలవుతున్న నిరుద్యోగ భృతి ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. యూత్ డిక్లరేషన్‌లో ఐదు హామీలు ఇచ్చిన ప్రియాంకాగాంధీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీ ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు యూత్ డిక్లరేషన్ అమలు చేయనందుకు సీఎం రేవంత్‌రెడ్డిపైన ప్రియాంకాగాంధీ ఎందుకు మొట్టికాయలు వేయడం లేదని హరీష్‌రావు నిలదీశారు. ఎన్నికల సమయంలో తెలంగాణకు వచ్చిన గాంధీ కుటుంబం నిరుద్యోగ యువతి, యువకులకు హామీలు ఇచ్చి దారుణంగా మోసం చేశారని ధ్వజమెత్తారు. నిరుద్యోగుల పక్షాన మాట్లాడిన ప్రొఫెసర్ కోదండరాం, ఆకునూరి మురళీ, రియాజ్, ఆఖరికి ప్రియాంక గాంధీకి కూడా ఉద్యోగాలు వచ్చాయని ఎద్దేవా చేశారు. తెలంగాణ రక్తంలోనే ప్రశ్నించే తత్వం ఉంటుందని స్పష్టం చేశారు. నిరుద్యోగులు వారి సమస్యలపై పోరాడాలని.. వారి న్యాయబద్ధమైన పోరాటానికి తాము సంపూర్ణ మద్దతు ఇస్తామని మాటిచ్చారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని రేవంత్ ప్రభుత్వాన్ని హరీష్‌రావు డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీల సాధనకు భారాస అండగా ఉంటుందని తెలిపారు. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. భారాస పాలనలో 1.62 లక్షల ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పారు. కాంగ్రెస్ హయాంలో జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు వస్తాయని యువత ఎన్నో ఆశలు పెట్టుకుందని.. కానీ ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని దుయ్యబట్టారు. 'దగా క్యాలెండర్‌తో నిరుద్యోగ యువతను మోసం చేశారు. నోటిఫికేషన్లు వద్దని యువత ధర్నాలు చేస్తున్నారని రేవంత్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రియాంక గాంధీ యూత్ డిక్లరేషన్ ప్రకటించారు.. 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చేవరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంట పడతాం. కమీషన్లు రావని రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం లేదా?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## బహుముఖ్ బనారస్ ఓ మంచి పుస్తకం

**ఆవిష్కరించి అభినందించిన వెంకయ్యనాయుడు**

**హైదరాబాద్, జూన్28** : పోలీసు అధికారిగా ఉండి మంచి పుస్తకం రాయడం గొప్ప విషయం అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. కిల్లాడ సత్యనారాయణ రచించిన పుస్తకం 'బహుముఖ బనారస్' ను వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయోధ్య ఆలయ జ్ఞాపికను సత్యనారాయణ ఆయనకు అందించారు. వెంకయ్య నాయుడు మాట్లాడుతూ..ఈ పుస్తకం కాశీలోని అనేక పార్శ్వాలను సృశించిందని అన్నారు. మన సంస్కృతిలో స్త్రీలకు గొప్ప ప్రాధాన్యం ఉంది అని చెప్పారు. యువతలో మార్పు రావాలని, సామాజిక, సాంస్కృతిక పునర్ వైభవం సాధించాలని సూచించారు. హిందూ అనేది జీవన విధానం అని సంపద, జనాభా, విజ్ఞానం ఉన్న దేశం మనది అని పేర్కొన్నారు. ఇలాంటి పుస్తకాలు వికసిత భారత్ కు తోడ్పడతాయని ఆశిస్తున్నానని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. ఒక మంచి పుస్తకాన్ని ఆవిష్కరించినందుకు చాలా ఆనందంగా ఉందని నాయుడు అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్ ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ డీజీ కిల్లాడ సత్యనారాయణ రాసిన 'బహుముఖ బనారస్' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని హోటల్ దస్పల్లలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకయ్య నాయుడు మాట్లాడారు. ఈ పుస్తకం కాశీలోని అనేక పార్శ్వాలను స్పృశించిందని చెప్పారు. కాశీ గురించి చెప్పకుండా భారత సంస్కృతి గురించి మాట్లాడలేమని తెలిపారు. పోలీసు అధికారిగా ఉండి కూడా ఇంత మంచి పుస్తకం రాయడం గొప్ప విషయమని కొనియాడారు. 'మన సంస్కృతిలో స్త్రీలకు గొప్ప ప్రాధాన్యం ఉంది. అందుకే దేశంలో నదులన్నీ స్త్రీల పేర్లే. ఈ నేల గొప్పదనం తెలిపే విధంగా నూతన విద్యావిధానం ఉండాలి. ఒక్కో నగరానికి ఒక్కో చరిత్ర ఉంది. అవన్నీ పుస్తకాలుగా రావాల్సిన ఆవశ్యకత ఉంది' అని వెంకయ్యనాయుడు అన్నారు.

## భౌతిక దాడులు సరికావు: కెటిఆర్

**హైదరాబాద్,** : ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు ఆస్కారం లేదని మాజీమంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అదే క్రమంలో.. అబద్దాలకు, అసందర్భ ప్రేలాపనలకు, మీడియా ముసుగులో చేసే రాజకీయాలకు కూడా అస్సలు తావు ఉండకూడదని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని ఓ న్యూస్ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై దాడి ఘటన నేపథ్యంలో కేటీఆర్ స్పందించి ఈ మేరకు ప్రకటన చేశారు.' కానీ, నేటి రాజకీయాల్లో అన్నీ మెయిన్ స్ట్రీమ్‌కి తీసుకొచ్చారు. భారాస సోదరులు సంయమనం పాటించాలి. న్యాయ పక్రియను నమ్ముకుందాం. మీ బాధను అర్థం చేసుకోగలను. పార్టీ, నాపై మీకు ఉన్న ప్రేమను గౌరవిస్తాను. ఈ బురదజల్లే ప్రయత్నంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం' అని కేటీఆర్ తెలిపారు.

## పసుపు బోర్డు కార్యాలయం నిజామాబాద్ రైతుల గర్వకారణం

**మొదటిపేజీ తరువాయి..** మోడీ నేతృత్వంలో దేశం అభివృద్ధి మార్గంలో వేగంగా సాగుతోందని అన్నారు. పసుపు బోర్డును ఇచ్చిన హామీ ప్రకారం ఏర్పాటు చేయడంలో బిజెపికే ఘనత ఇచ్చారు. ఈ బోర్డు ఏర్పాటుతో పసుపు రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తాయని, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతుల అవకాశాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. పేదలకు ఇళ్ల నిర్మాణం, ఉచిత నల్లా కనెక్షన్లు, మారుమూల గ్రామాలకు విద్యుత్, ఇంటర్నెట్ వంటి ప్రాథమిక వసతుల కల్పన కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా చేపట్టిందని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా 60 కోట్ల మందికి ఆరోగ్య సేవలు అందిస్తున్న కేంద్రం, 50 కోట్ల మంది జన్‌ధన్ ఖాతాదారులకు బ్యాంకింగ్ సదుపాయాలు కల్పించిందని గుర్తు చేశారు. కొత్తగా దేశంలో 88 విమానాశ్రయాలు ఏర్పాటు చేయడం కేంద్ర పాలనలో సాధ్యమైందని చెప్పారు. రైతు మహాసభలో అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## రా చీఫ్‌గా పరాగ్ జైన్ నియామకం

**మొదటిపేజీ తరువాయి..** కీలక పాత్ర పోషించారు. శత్రు దేశం వ్యవస్థలపై సమగ్ర సమాచారాన్ని సేకరించడంలో ఆయన అనుభవం వశంగా పనిచేసింది. అలాగే, జమ్ము కశ్మీర్‌లోని ఉగ్రవాదులపై కేంద్రం చేపట్టిన కీలక చర్యల్లో పరాగ్ సమర్థవంతంగా మేథో వేదికన సహకరించారు. బహు ప్రాంతాల్లో సేవలిచ్చిన అనుభవం, వ్యూహాత్మక ఆపరేషన్లపై లోతైన అవగాహన కారణంగా పరాగ్ జైన్ నియామకాన్ని ప్రభుత్వ వర్గాలు కీలకమైనదిగా అభివర్ణిస్తున్నాయి. రా చీఫ్‌గా ఆయన నాయకత్వం కీలక మలుపులో ప్రవేశించనున్నట్లు నిపుణుల అభిప్రాయం.

## పూరి రథయాత్రలో తొక్కిసలాట కలకలం

**మొదటిపేజీ తరువాయి..** ఉన్నారు. గాయపడిన వారిలో పలువురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. తాజా సమాచారం ప్రకారం, అత్యధికంగా గాయపడిన వారు పూరి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. 70 మందికి పైగా అక్కడ చికిత్సలో ఉండగా, ఎనిమిది మంది ఆరోగ్యం ఆందోళనకరంగా ఉందని వైద్యాధికారులు తెలిపారు. మిగిలిన వారు పూరి మరియు చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఇతర ఆసుపత్రుల్లో చేరారు.
రథయాత్ర సందర్భంగా భక్తులు భారీగా తరలిరావడంతో, రథాన్ని లాగేందుకు తాళ్లను పట్టుకునేందుకు ముందుకు రావడమే తొక్కిసలాటకు కారణమైందని ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. బాలగండి ప్రాంతానికి సమీపంలో ఈ ప్రమాదం సంభవించినట్లు స్థానిక వర్గాలు పేర్కొన్నాయి. ఈ తొక్కిసలాటలో కొంతమంది మీడియా ప్రతినిధులు కూడా గాయపడ్డారు. ఈ ఘటనపై ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ స్పందించారు. గాయపడిన భక్తులకు తక్షణ వైద్యసాయాన్ని అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పరిస్థితిని నియంత్రణలోకి తేవడానికి అత్యవసర సేవల బలగాలను రంగంలోకి దించారు. రథయాత్ర వేళ ఇలా పెద్దఎత్తున తొక్కిసలాట జరగడం భక్తులలో ఆందోళన రేపుతోంది. భద్రతా ఏర్పాట్లపై ప్రశ్నలు తున్న వేళ, అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

## దేశానికి అభివృద్ధి తెచ్చేది కాంగ్రెస్ పాలనే

**మొదటిపేజీ తరువాయి..** నిపుణులు చెప్పినా, కేంద్రం మాత్రం 41 మీటర్ల వద్దే ఆగిపోతోందని పేర్కొన్నారు. పైగా ఈ విషయంపై పార్లమెంటులో ఒక్క ఎంపీ స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. తల్లి కోసం వందనం పథకానికి 87 లక్షల మంది అర్హులుండగా, కేవలం 60 లక్షల మందికే అందిందని, మహిళా శక్తి పేరిట ప్రకటించిన రూ.18 వేల ఆర్థిక సాయం ఇప్పటికీ అమలులోకి రాలేదని చెప్పారు. ఉచిత బస్సు హామీ గురించి మాట్లాడుతూ, తక్కువ వ్యయం ఉన్నా దానిని అమలు చేయలేకపోయారని, అదే పథకం తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని వివరించారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ప్రజలపై రూ.32 వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారం మోపిందని, ఒక్క ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం మరో రూ.17 వేల కోట్ల భారం వేసిందని ఆరోపించారు.రాష్ట్రంలోని అన్ని పార్టీలు కేంద్రంలోని బీజేపీకి విధేయంగా వ్యవహరిస్తున్నాయనడంలో సందేహమే లేదని, ఇది ప్రజల ఆకాంక్షలకు విరుద్ధమని అన్నారు. కార్యక్రమంలో కార్యకర్తల వినతులు స్వీకరించిన షర్మిల, స్థానికంగా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ కేంద్రమంత్రి ఎం.ఎం. పల్లంరాజు, జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందం, నేతలు కామన ప్రభాకర్ రావు, చెక్క నూకరాజు, నీరుకొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దత్తత గొప్ప కార్యక్రమం

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కితాబు**

**జగిత్యాల,** : పేద విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న కృషి అభినందనీయమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు. పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గొల్లపల్లి గణేష్ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థుల సంక్షేమానికి విద్యార్థి దత్తత కార్యక్రమాన్ని చేపట్టారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ధర్మపురి పట్టణంలో శనివారం విద్యార్థి దత్తత కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక విద్యాభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలను ప్రభుత్వం చిత్తశుద్ధితో చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాములు, స్థానిక ప్రధానోపాధ్యాయులు కొలిచాల శ్రీనివాస్, గాదె శ్రీనివాస్, పెంద్యాల మహేందర్, ఎంఈఓ సీతాలక్ష్మి నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

## కోల్‌కతా లా కాలేజీ సామూహిక అత్యాచార కేసులో సెక్యూరిటీ గార్డు అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి..** ఏర్పాట్లపై ప్రశ్నలు గుప్పిస్తున్నారు. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. కాలేజీలో భద్రతా బాధ్యతలపై విచారణ మహిళా విద్యార్థుల కోసం ప్రత్యేక భద్రత చర్యలు తీసుకునే సూచన నిందితులపై పాస్కో చట్టంతో పాటు గ్యాంగ్ రేప్ సెక్షన్ల కింద కేసులు ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ఇంకా అధికారికంగా స్పందించలేదు కానీ, ప్రజా ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో త్వరలో సమగ్ర చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## ఉద్దానం పేజ్ -2 మంచినీటి పథకానికి శంకుస్థాపన

**మొదటిపేజీ తరువాయి..** బూరగాం గ్రామంలో రూ.265 కోట్లతో చేపట్టనున్న ఉద్దానం పేజ్ -2 మంచినీటి పథకానికి శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్రమంత్రి, గత ప్రభుత్వాల మాదిరిగా మాఫియా, అక్రమాలు, లిక్కర్ ఆదాయంతో , ప్రజల సేవే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం మీద ఎవరికైనా అభ్యంతరాలుంటే వారు స్వేచ్ఛగా ఎదిరించే హక్కు ఉందని, అలాంటి పరిస్థితుల్లో అధికార హింసకు పాల్పడే విధానం తమ ప్రభుత్వానికి లేదని వెల్లడించారు. ప్రజల సమస్యలను నేరుగా విని పరిష్కరించే తీరుతో పాలన కొనసాగుతోందని తెలిపారు.
అనంతరం ఆయన 'ఇండియా టర్న్స్ పింక్' సంస్థ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లాలో మహిళల కోసం ప్రారంభించిన ఉచిత బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద జిల్లాలోని 10,000 మంది గ్రామీణ మహిళలకు ఉచితంగా స్క్రీనింగ్ సేవలు అందించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమం మహిళలలో అవగాహన పెంచి, క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి, మరిన్ని ప్రాణాలను రక్షించాలన్న లక్ష్యంతో చేపట్టబడిందని వివరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ విపిన్ కుమార్, ఉఖీ సభ్యులు శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు. మహిళలకు అవసరమైన ఆరోగ్య సేవలను చేరవేయడంలో ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు.

## అన్నపూర్ణా క్యాంటీన్ పేర్లు మార్పు తగదు: కెటిఆర్

**హైదరాబాద్,** : జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తోన్న 'అన్నపూర్ణ పథకం' పేరు మార్పుపై మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డిపై 'ఎక్స్'లో కేటీఆర్ విమర్శలు గుప్పించారు. దిల్లీ బాస్‌లకు మీ విధేయత చూపించాలనుకుంటే మీ పేరును రాజీవ్ లేదా జవహర్‌గా ఎందుకు మార్చుకోకూడదని ప్రశ్నించారు. అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్చడం హాస్యాస్పదమన్నారు. 2028లో భారాస తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అర్థరహిత నిర్ణయాలన్నింటినీ రద్దు చేస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో అన్నపూర్ణ క్యాంటీన్ల ద్వారా రూ.5కే భోజనం అందిస్తున్నారు. ఇందిర క్యాంటిన్లుగా పేరు మార్చి.. రూ.5కే భోజనం, అల్పాహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

## కొందరు నా వ్యాఖ్యలతో నొచ్చుకున్నారు

**క్రమశిక్షణా కమిటీ ముందు కొండా మురళి వివరణ**

**హైదరాబాద్,** : కాంగ్రెస్ నేతలంటే గౌరవం ఉంది. కొందరు నేతలు నా వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్నారు. వాటిని పట్టించుకోవద్దని కాంగ్రెస్ నేత కొండా మురళి ప్రకటించారు. ఈ మేరకు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ముందు హాజరయ్యారు. కాంగ్రెస్ నేత కొండా మురళి వ్యాఖ్యలపై ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఇటీవల పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన శనివారం గాంధీభవన్‌లో పీసీసీ క్రమశిక్షణ కమిటీ ముందు హాజరయ్యారు. గాంధీభవన్‌కు పెద్దసంఖ్యలో కార్యకర్తలతో తరలివచ్చిన ఆయన.. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి ముందు వివరణ ఇచ్చారు. ఆరు పేజీల లేఖను క్రమశిక్షణ కమిటీకి అందించారు. అనంతరం కొండా మురళి మాట్లాడుతూ.. 'నా వ్యాఖ్యలపై మల్లు రవికి వివరణ ఇచ్చాను. కాంగ్రెస్ నేతలంటే నాకు గౌరవం ఉంది. కొందరు నేతలపై వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవద్దు. నేను బలవంతుడినో, బలహీనుడినో అందరికీ తెలుసు. కార్యకర్తలను పట్టించుకోవాలని మాత్రమే కోరాను. రేవంత్ రెడ్డి మళ్లీ సీఎం కావాలి. బీసీలకు మేలు జరగాలని 40 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా. రాహుల్ గాంధీని ప్రధాని చేయాలనే తపన మా అందరిలో ఉంది' అని పేర్కొన్నారు. మరోవైపు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి మాట్లాడారు. మేం నోటీసు ఇస్తే కొండా మురళి వచ్చారు. ఆయన మాకు వివరణ ఇచ్చారు. రాతపూర్వకంగా కూడా వివరణ ఇచ్చారని తెలిపారు.

## బక్కన్నపాలెంలో నీటి సరఫరా నిలిపివేతపై ఆందోళన

**విశాఖపట్టణం,** : బక్కన్న పాలెం జివిఎంసి పరిధిలో తాగునీరును నిలిపివేశారు. జివిఎమ్ సి చరిత్రలో మంచినీటి సరఫరా ఆగిపోవడం ఇదే తొలిసారి అని పలు కాలనీల ప్రజలు అన్నారు. 3 లక్షల ఇంటి కుళాయిలకు మంచినీటి సరఫరా నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో బక్కన్న పాలెంలో ఖాళీ బిందెలతో మహిళలు ధర్నాచేశారు. తాగునీరు లేక అవస్థలు పడుతున్నామని మహిళలు చెప్పారు. మరోసారి మేయర్ తో చర్చలకు వాటర్ సప్లై ఉద్యోగులు వెళ్లనున్నారని తెలిపారు. చర్చలు సఫలం అయితేనే.. వాటర్ సప్లై ఉద్యోగులు నీటిని విడుదల చేస్తామంటున్నారని మహిళలు స్పష్టం చేశారు.

# మైనారిటీ మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

### అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళలా

### ప్రభుత్వం ముందుకెళ్తుంది

### పట్నం మహేందర్ రెడ్డి, మధుయాష్కీ గౌడ్



స్టార్ త్రినేత్రం, హయత్ నగర్: రేవంతన్న భరోసా పథకంలో భాగంగా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం హయత్ నగర్ లోని చెన్నాగొని స్వామి ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ హాజరయ్యారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళలాగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం సంక్షేమాన్ని ఆపటం లేదని.. పేద మహిళలకు వ్యక్తిగతంగా ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఇలాంటి కుట్టు మిషన్ల పంపిణీ చేపడుతుందని పేర్కొన్నారు. మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. మహిళలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా ఎదిగేందుకు ఆర్టీసీ బస్సుల ఏర్పాటుతో పాటు, పెట్రోల్ బంకులు, మహిళా క్యాంటీన్లు తదితర స్వయం ఉపాధి ఏర్పాటు చేయిస్తుందన్నారు. మహిళల కుటుంబాల్లో భరోసా కల్పించాలి అన్న లక్ష్యంతో రేవంతన్న భరోసా పథకం ద్వారా కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేయించి స్వయం ఉపాధి కల్పించడం.. చదువుకున్న యువతీ యువకులకు ఉద్యోగం అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని వివరించారు. వివిధ కంపెనీలకు సంబంధించి సిఎస్ఆర్ ఫండ్ ద్వారా ఉపాధి కల్పన కోసం స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను చేపడతామని వివరించారు. సన్నబియ్యం పంపిణీ, సీఎం రిలీఫ్ ఫండ్, విద్యార్థుల చదువులకు ప్రభుత్వ గురుకులాలు తదితర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. విదేశాల్లో చదివేందుకు కూడా ప్రభుత్వం ద్వారా ఓవర్సీస్ స్కాలర్షిప్ అందిస్తూ ప్రభుత్వం పేద వర్గాల విద్యను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. సహకరిస్తుందని వివరించారు. పేద వర్గాల అభివృద్ధి, అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్.. ఇలా అన్ని వర్గాల సమైక్య జీవన విధానం హైదరాబాద్ కు సొంతమన్నారు. ఈ సందర్భంగా 207 మంది లబ్ధిదారులకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వజ్ర ప్రకాష్ గౌడ్, లక్ష్మీ ప్రసన్న, టిపిసిసి కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్, మహిళా కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షురాలు కళ్లెం సుజాత రెడ్డి, ధారాసింగ్, డివిజన్ అధ్యక్షులు చెన్నగోని రవీందర్, శ్రీ పాల్ రెడ్డి, వేణుగోపాల్ యాదవ్ గారు, మకుటం సదాశివుడు, కుట్ల నరసింహ యాదవ్, మంజులా రెడ్డి లింగాల కిషోర్ గౌడ్, బుడ్డా సత్యనారాయణ, శశిధర్ రెడ్డి, బండా సురేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్ నేలపాటి రామారావు, పన్యాల జైపాల్ రెడ్డి, మెగావాత్ గణేష్ నాయక్, కర్మన్ఘాట్ దేవాలయ డైరెక్టర్లు కంచర్ల కవిత, నాయకులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, రజిని రావు, అక్కనపల్లి రాజేశ్వరి, వసంత, స్వర్ణ మాధవి, భాను, రాణి, మైనారిటీ సెల్ ఎల్బీనగర్ అధ్యక్షులు షేక్ షాకీర్, నాయకులు రిజ్వాన్, సల్మాన్ , మక్సూద్, దాసరమోని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బీడీఎల్ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**స్టార్ త్రినేత్రం, హయత్ నగర్:** హయత్ నగర్ డివిజన్ బీడీఎల్ కాలనీలో జరుగుతున్న పార్క్ మరియు సీసీ రోడ్ల అభివృద్ధి పనులను కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, ఏఈ హేము నాయక్ తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని కార్పొరేటర్ కి తెలపడంతో వారు వెంటనే అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని వారు ఏఈకి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మాధవరెడ్డి, సంక్షేమ సంఘం సభ్యులు విజయబాబు, జనార్ధన్ రెడ్డి, నాగేశ్వరరావు, శేఖర్ మరియు వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు ..

## వైద్యారోగ్య శాఖ పోస్టులకు ఆర్థికశాఖ ఆమోదం

### 607 పోస్టులకు భర్తీకి నోటిఫికేషన్.. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్,జూన్28** : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీకి భారీ నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 607 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి ఇచ్చినట్టు ఇచ్చినట్టు తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీజీఎంహెచ్ఎఆర్బీ) సెక్రటరీ గోపీకాంత్‌రెడ్డి తెలిపారు. మల్టీ జోనల్1 లో 379 పోస్టులు, మల్టీ జోనల్2 లో 228పోస్టుల భర్తీకి నియామక పక్రియ జరగనుంది. జూలై 10వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ పక్రియ ప్రారంభం కానున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖ చాన్నాళ్ల తర్వాత భారీ ఉద్యోగ నోటిఫఇకేషన్ జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మెడికల్ కళాశాలల్లో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాళీలను ఈ నియామకం కింద భర్తీ చేయనున్నారు. దరఖాస్తు చేసుకునే వారి వయసు 46 ఏళ్ల లోపు ఉండాలి. సంబంధిత విభాగంలో అర్హత కలిగిన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ఓపెన్ చేసి పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు. దరఖాస్తుల స్వీకరణ పక్రియ జూలై 10వ తేదీ నుంచి ఆరంభమవుతుంది. జూలై 17 సాయంత్రం 5 గంటలలోపు అర్హులైన అభ్యర్థులు అధికారిక వెబ్ సైట్ - లో అప్లై చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తారని గుర్తుంచుకోవాలి. దరఖాస్తు ఫీజు రూ.500 లు కాగా ప్రాసెసింగ్ ఫీజు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ అభ్యర్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. జూలై 18- జూలై 19 వరకూ అప్లికేషన్ ఎడిట్ ఆప్షన్ ద్వారా వివరాలు సరిచేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ పోస్టుకు ఎంపికైన వారికి నెల జీతం రూ.68,900- రూ.2,05,500 మధ్య ఉంటుంది. నోటిఫికేషన్ ద్వారా పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు.

## అన్నపూర్ణ క్యాంటీన్ పేరు ఎలా మారుస్తారు?

### జిహెచ్ఎంసి ముందు బిఆర్ఎస్ నేతల ధర్నా

### కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ కార్పోరేటర్లు

**హైదరాబాద్, జూన్28** : అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్పుపై బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. శనివారం ఉదయం జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద గులాబీ పార్టీ కార్పొరేటర్లు ధర్నాకు దిగారు. 5 రూపాయలకే పేదల కడుపు నింపే అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్చాలనే స్టాండింగ్ కమిటీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్లకార్డులతో నిరసన చేపట్టారు. అన్నపూర్ణ క్యాంటీన్లను ఇందిరా క్యాంటీన్లుగా పేరు మార్చే కుట్రను అడ్డుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. అయితే బీఆర్ఎస్ కార్యకర్తలను గేటు బయటే పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో బల్దియా ప్రధాన కార్యాలయం ముందు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జీహెచ్ఎంసీ కార్యాలయంలోకి వెళ్లేందుకు బీఆర్ఎస్ నేతలు యత్నించారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లతో కలిసి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ జంట నగరాలకు ఎంతో మంది వస్తుంటారని.. అలాంటి వారికి కడుపునిండా అన్నం పెట్టాలని అన్నపూర్ణ క్యాంటీన్ల పథకం కేసీఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని తెలిపారు. అన్నపూర్ణ పేరు మార్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయానికి వచ్చినట్లు తెలిసిందన్నారు. పేరు మార్చాలని ఉద్దేశం ఉంటే జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకు నిర్ణయం తీసుకోవాలని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ప్రజలకు ఇచ్చిందన్నారు. 'ఆరు గ్యారెంటీలకు నచ్చిన పేరు పెట్టుకోండి.. మాకు అభ్యంతరం లేదు. అన్నపూర్ణ పేరు మార్పు మంచి పద్ధతి కాదు' అని మండిపడ్డారు. ఆరోగ్య శ్రీ తెచ్చిన రాజశేఖర్ రెడ్డి పేరే తాము కొనసాగించడం జరిగిందన్నారు. అన్నపూర్ణ అనగానే అమ్మవారు గుర్తుకు వస్తారని.. అన్నపూర్ణ పేరు మార్చాలని ప్రభుత్వానికి ఉద్దేశం ఉంటే కౌన్సిల్ సమావేశంలో చర్చ పెట్టి, ఓటింగ్ పెట్టాలని డిమాండ్ చేశారు. శనివారం పీజేఆర్ ఫ్లై ఓవర్ ఓపెన్ చేస్తున్నారని.. మరి అది కట్టింది ఎవరని ప్రశ్నించారు. తిమ్మిని బొమ్మను చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటే అని విమర్శించారు. పేరు మార్పు వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు.

## పివికి చంద్రబాబు, లోకేశ్ ఘన నివాళి

**అమరావతి, జూన్28** : మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు 104వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నివాళులర్పించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. పీవీని స్మరించుకున్నారు. ఆయన తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలను దేశ పరిస్థితిని మార్చేశాయని గుర్తు చేసుకున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి మాజీ ప్రధాని అంటూ కొనియాడారు. 'భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గారి 104వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉండగా ప్రధాని బాధ్యతలు స్వీకరించి ఆర్థిక సంస్కరణల ద్వారా దేశగతిని మార్చిన పీవీ ఎప్పటికీ స్ఫూర్తిగానే నిలుస్తారు.

## మహాటీవీ ఛానల్‌పై దుండగుల దాడి

### చంద్రబాబు, లోకేశ్ ఖండన

**హైదరాబాద్,** : తెలుగు న్యూస్ టీవీ ఛానల్ 'మహా న్యూస్' హైదరాబాద్ ప్రధాన కార్యాలయంపై దుండగులు దాడి చేశారు. కర్రలు, రాళ్లతో ఆఫీస్ మీద దాడి చేసి బిల్డింగ్ అద్దాలు, కార్ల అద్దాలు పగులగొట్టారు. కర్రలతో ఆఫీస్ లోకి చొరబడేందుకు ప్రయత్నించారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. పీ సీఎం చంద్రబాబు ఈ ఘటనపై సోషల్ మీడియా ప్లాట్ ఫాం ఎక్స్‌లో స్పందించారు. ' హైదరాబాద్ మహా టీవీ హెడ్ ఆఫీసుపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రజావాణి వినిపించే మీడియాపై దాడి ప్రజాస్వామ్యంపై దాడిగానే పరిగణించాలి. మహా టీవీపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. కథనాలు,ప్రసారాల పట్ల అభ్యంతరాలు ఉంటే, తెలియజేయవచ్చు. వివరణ కోరవచ్చు, ఖండన అడగవచ్చు. ఇటువంటి దాడులు క్షమార్హం కాదు. మహా యాజమాన్యానికి సంఘీభావం తెలుపుతున్నాను.' అని చంద్రబాబు అన్నారు. మంత్రి నారా లోకేష్ కూడా మహాన్యూస్ పై దాడిని ఖండించారు. 'తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ మీడియా ఛానల్ మహా న్యూస్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిని ఖండిస్తున్నాను. హైదరాబాద్ లోని ఛానల్ కార్యాలయంపై దుండగులు దాడి చేసి విధ్వంసం సృష్టించడం దారుణం. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులకు చోటు లేదు. బెదిరింపులు, దాడులతో మీడియాను కట్టడి చేయాలనే ఆలోచన మంచిది కాదు. ప్రజలు, సమాజం దీన్ని ఆమోదించరు. మహా న్యూస్ యాజమాన్యానికి, సిబ్బందికి, జర్నలిస్టులకు సంఘీభావం తెలుపుతున్నానని లోకేష్ అన్నారు.

## నంద్యాల పట్టణం అభివద్ధికి సమిష్టిగా కృషి: మంత్రి ఫరూక్

**నంద్యాల,** : నంద్యాల పట్టణం అభివద్ధికి అధికారులందరు సమిష్టిగా కలిసి పని చేయాలని రాష్ట్ర న్యాయ శాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. శనివారం నంద్యాల మున్సిపాలిటీని మంత్రి ఫరూక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి
ఫరూక్ మున్సిపల్ కమిషనర్ శేషన్న, మున్సిపల్ ఎంఈ గుర్రప్పలను సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే నూతనంగా నంద్యాల మున్సిపల్ కమిషనర్‌గా ఛార్జ్ తీసుకున్న శేషన్నతో.. మున్సిపల్ సిబ్బంది సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించి నంద్యాల మున్సిపాలిటీ అభివృద్ధికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్, ఇంజనీరింగ్ డిఈఈలు శానిటేషన్ సూపర్ వైజర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి కవిజ్ఞాన కేంద్రంలో కమ్యూనిటీ కిచెన్

**విశాఖపట్టణం,** : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ కిచెన్ ను విజ్ఞాన కేంద్రం చైర్మన్ సిహెచ్.నరసింగరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కమ్యూనిటీ కిచెన్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగే విద్యా, వైజ్ఞానిక, సామాజిక, సాంస్కృతిక, మేధో, పరిశోధనా కార్యక్రమాలకు ఎంతో తోడ్పాటు నిస్తుందని అన్నారు. అలాగే ఈ కేంద్రం నిరంతరం బాలోత్సవాలు, బాలల్లో శాస్త్రీయ దృక్పథం కలిగించే అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. కంప్యూటర్ స్కిల్ డెవలప్మెంట్, టైలరింగ్ , ట్యూషన్ సెంటర్లు, పోటీ పరీక్షలకు శిక్షణ, మెడికల్ క్యాంపులు వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. అనతి కాలంలోనే విశాఖ నగరంలో ఎంతో పేరు గడిచిందని కొనియాడారు. తాజాగా విజ్ఞాన కేంద్రంలో కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేయడం ఎంతో మందికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ కిచెన్ కి కుక్కర్లు, వంట స్టవ్వులు, పాత్రలు ఇచ్చిన రామారావుని అభినందించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం సెక్రటరీ డా, బి గంగారావు, ట్రస్టీ ఎం జగ్గునాయుడు, ట్రస్ట్ నిర్వాకులు ఎం ఆర్ డి రాజు, విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వాహకులు జిఎస్ రాజేశ్వరరావు, దండు నాగేశ్వరావు, బుజ్జి, కామేశ్వరరావు, కొండప్ప తదితర లు పాల్గొన్నారు.

## పివికి కెసిఆర్ ఘన నివాళి

### ఘనంగా నివాళి అర్పించిన పార్టీ నేతలు

**హైదరాబాద్,** : పీవీ మన తెలంగాణ ఠీవి.. భారతదేశ ఆణిముత్యం..' అని బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు అభివర్ణించారు. పీవీ స్ఫూర్తితో ప్రజా సంక్షేమ పాలన కొనసాగించడమే వారికి మనం అర్పించే నివాళి అని పేర్కొన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆయన దేశాభ్యున్నతికి చేసిన కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. తెలంగాణ బిడ్డగా, పాలనాదక్షుడిగా, భారత ప్రధానిగా.. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టి, జాతి ఔన్నత్యాన్ని నిలబెట్టిన గొప్ప వ్యక్తి పీవీ అని ప్రశంసించారు. బహు భాషా కోవిదుడుగా, సాహితీవేత్తగా, రాజకీయ దురంధరుడుగా, దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడిగా ప్రసిద్ధిగాంచిన తీరు అజరామరమని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కొద్దికాలమే పనిచేసినా ఆయన తెచ్చిన పాలనా సంస్కరణలు ఆదర్శమని కొనియాడారు. వారి కీర్తిని విశ్వవ్యాప్తం చేయాలనే తెలంగాణ ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకొని 'పీవీని తెలంగాణ ఠీవిగా' ప్రపంచానికి చాటిన ఘనత బీఆర్ఎస్ సర్కారుకే దక్కిందని తెలిపారు. పీవీ శతజయంత్యుత్సవాలను ఘనంగా జరుపుకోవడమే కా కుండా, భవిష్యత్తు తరాలు ఆయన కృషిని గుర్తుంచుకొని స్ఫూర్తి పొందేవిధంగా నెక్లెస్ రోడ్డుకు పీవీ మార్గ్‌గా నామకరణం చేశామని గుర్తుచేశారు. పీవీ 16 అడుగుల కాంస్య విగ్రహాన్ని నెలకొల్పామని, పీవీ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఆయన వారసత్వం కొనసాగింపుగా కూతురు సురభి వాణీదేవికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చామని గుర్తుచేశారు. పీవీకి భారతరత్న పురస్కారం ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చామని తెలిపారు. పీవీ కృషికి గుర్తింపుగా వంగర, లక్నెపల్లిని పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడంతోపాటు వరంగల్, కరీంనగర్, వంగర, ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో పీవీ కాంస్య విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. పీవీ గొప్పదనాన్ని స్మరించుకోవడం అంటే తెలంగాణ బిడ్డలు తమ గొప్పదనాన్ని గుర్తుచేసుకోవడమేనని కేసీఆర్ పేర్కొన్నారు.

## ఓటర్ల జాబితా రూపొందించడంలో సహకరించండి..

### అర్హులైన యువ ఓటర్ల నమోదు దిశగా ప్రోత్సహించండి.. డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం

**విజయవాడ,** : దోషరహిత, తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించడంలో రాజకీయ పక్షాలు అధికారులకు పూర్తి సహకారం అందించాలని అర్హులైన యువ ఓటర్లను నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు.కలెక్టరేట్‌లోని ఎవిఎస్ఎన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్‌వో లక్ష్మీనరసింహం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈసీఐ ఆదేశాల మేరకు ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన ఎన్నికల వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంతో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతినెలా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పక్షాలు బూత్ లెవెల్ అధికారులతో బూత్ లెవెల్ అసిస్టెంట్లు సమన్వయం చేసుకొని అర్హులైన యువతను ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు సహకరించాల్సిందిగా కోరారు. ప్రస్తుత ఓటర్ల జాబితాలో మరణించినా, శాశ్వతంగా వలస వెళ్లినా వారి పేర్లను బీఎల్‌వోకు తెలియజేయాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, ఓటరు కార్డులో ఏవైనా తప్పులు ఉంటే వాటికి సంబంధించి ఫారం-8 నమోదు చేసి, సరిచేసేందుకు సహకరించాల్సిందిగా కోరారు. జిల్లాలో ఫారం 6, ఫారం 7, ఫారం 8 అర్జీలకు సంబంధించిన ప్రస్తుత వివరాలను తెలియజేసి సమాచారాన్ని రాజకీయ పక్షాలకు అందించారు. సమావేశంలో రాజకీయ పక్షాల ప్రతినిధుల సందేహాలను డీఆర్‌వో నివృత్తి చేశారు. మరణించిన ఓటర్ల తొలగింపు పై అన్ని స్థాయిలలోను విచారణ చేయాలని, ఒకే కుంటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా, ఒకే డోర్ నెంబర్‌తో నమోదై ఉన్న నగరపాలక సంస్థ పరిధిలో అపార్టమెంట్ విషయంలోను ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని రాజకీయ పక్షాల ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.సమావేశంలో ఎన్నికల సెల్ డిప్యూటీ తహాశీల్దార్ ఎఎస్ఆర్ గోపాలరెడ్డి, వై రామయ్య (టిడిపి), తరుణ్ కాకాని (బీజేపీ), బి. పుష్పరాజ్ (బిఎస్పి) బొర్రా కిరణ్ (ఐఎన్‌సి), ఎస్.అనిల్‌చంద్ (ఐఎన్‌సి) పాల్గొన్నారు.


వరంగల్ | సంపుటి:1 | సంచిక -32 | ఎడిటర్ : ధీ శివకృష్ణ | ఆదివారం 29 జూన్ 2025 | పేజీలు 4 | వెల : రూ. 2
WARANGAL | VOL-1 | ISSUE-32 | 4 | Editor: D.SHIVAKRISHNA | SUNDAY 29 JUNE 2025 | Pages:4 | Price: 2

# హిట్ టాక్‌లో కన్నప్ప మూవీ




మంచు విష్ణు హీరోగా నటించిన కన్నప్ప సినిమా ఎట్టకేలకు నిన్న ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. కొన్నిసార్లు వాయిదా పడిన ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి పాజిటివ్ టాక్ సంపాదించింది. సినిమా బాలేదని అనే వాళ్లు ఉన్నా సరే, ఎక్కువ శాతం మాత్రం సినిమా బాగుందని అంటున్నారు. అయితే ఈ సినిమా టీం మాత్రం ఒక ఆసక్తికరమైన పోస్టర్ రిలీజ్ చేయడం చర్చకు తావిస్తోంది. నిజానికి ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ప్రేక్షకులు కూడా థియేటర్లకు వెళ్లి చూడాలనుకుంటున్నారు. చాలామంది చూస్తున్నారు. అయితే ఏకంగా మొదటి రోజే ఇండస్ట్రీ హిట్ కన్నప్ప అంటూ పోస్టర్ రిలీజ్ చేయడంతో ఒక్క రోజులోనే ఇండస్ట్రీ హిట్ స్టేటస్ సాధించిన ఘనత ఈ సినిమాకే దక్కుతుంది అంటూ సోషల్ మీడియాలో కొందరు ట్రోల్ చేస్తున్నారు. ఇండస్ట్రీలో అప్పటివరకు ఉన్న హిట్ సినిమా రికార్డులను ఈ సినిమా తిరగరాసి అత్యధిక కలెక్షన్లు రాబడితే దాన్ని ఇండస్ట్రీ హిట్ అని అభివర్ణిస్తారు. కానీ మంచు విష్ణు సినిమా టీం ఏమని ఆలోచించిందో తెలియదు, కానీ ఏకంగా రెండవ రోజు ఇలా రికార్డు స్థాయిలో ఇండస్ట్రీ హిట్ పోస్టర్ రిలీజ్ చేయడం చర్చకు తావిస్తోంది.

## తమ్ముడు చిత్రానికి ఎ సర్టిఫికెట్




టాలీవుడ్ నటుడు నితిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం తమ్ముడు వకీల్ సాబ్ ఫేమ్ వేణు శ్రీరామ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. కన్నడ నటి సప్తమి గౌడ కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రాన్ని జూలై 4న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గోంటున్నారు మేకర్స్. ఇప్పటికే ట్రైలర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా సెన్సార్ కంప్లీట్ చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ సినిమాకు ఏ సర్టిఫికెట్‌ను అందించింది. ఈ విషయాన్ని చిత్రయూనిట్ సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ సినిమాలో లయ, స్వశిక, వర్ష బొల్లమ్మ, సౌరభ్ సచ్‌దేవా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శ్రీ వెంకటేశ్వర బ్యానర్‌పై దిల్ రాజు నిర్మించిన ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందించారు.

# పూర్తిస్థాయి దర్శకత్వం వహించలే..

**అప్పుడు నటనను వదిలేస్తానన్న అమీర్**



'సితారే జమీన్ పర్' అంటూ ప్రేక్షకుల ముందుకువచ్చి మనసులను కదిలించారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్. విమర్శకుల ప్రశంసలు అందుకుంటోన్న ఈ సినిమా విజయం తర్వాత ఆయన ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తనకు నటన అంటే ఎంతో ఇష్టమని తెలిపారు. అలాగే దర్శకత్వం వైపు వెళ్లకపోవడానికి గల కారణాన్ని వివరించారు. ఆమిర్‌ఖాన్ దర్శకత్వం వహించిన ఏకైక సినిమా 'తారే జమీన్ పర్'. హిట్ టాక్‌ను సొంతం చేసుకొని ఆయనకు పేరు తెచ్చిన ఆ సినిమా తర్వాత ఆయన దర్శకత్వం వహించలేదు. తాజాగా ఈ విషయంపై మాట్లాడుతూ.. 'పూర్తిగా దర్శకుడిగా మారకపోవడానికి ఏకైక కారణం నటనపై నాకున్న ఇష్టమే. ఈ పరిశ్రమలో దర్శకత్వం, నిర్మాణం రెండూ చాలా ఆసక్తికరంగా ఉంటాయి. ఒకవేళ నేను దర్శకత్వం వైపు వెళ్తే నటన బోరింగ్‌గా అనిపిస్తుంది. బోర్ కొట్టిన పనిని నేను చేయలేను. కాబట్టి నటన మానేస్తాను. 'తారే జమీన్ పర్'కు కూడా అనుకోని పరిస్థితుల్లో దర్శకత్వం వహించాను. అప్పుడు నేనున్న పరిస్థితులు అలా ప్రేరేపించాయి' అని చెప్పారు. ఇక లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో తాను నటించేది సూపర్ హీరో సినిమా అని ఆమిర్ తెలిపారు. 'లోకేశ్ ఎంతో ప్రతిభావంతుడు ఆయనతో కలిసి వర్క్ చేసేందుకు ఎదురుచూస్తున్నాను. ఈ చిత్రం సెట్స్ పైకి వెళ్లడానికి సమయం పడుతుంది. నేను రాజ్‌కుమార్ హిరాణీ సినిమా పూర్తిచేశాక ఇందులో నటిస్తాను. వచ్చే ఏడాది సెప్టెంబర్‌లో దీన్ని ప్రారంభించే అవకాశాలున్నాయి' అని చెప్పారు. ఇక ఆమిర్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'సితారే జమీన్ పర్' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. రాష్ట్రపతి ద్రౌపదీముర్ము కూడా దీన్ని వీక్షించి ప్రశంసించారు. రాష్ట్రపతి భవన్‌లో ఆమె కోసం ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. మానసిక దివ్యాంగులు తమకున్న సమస్యను అధిగమించి ఎలాంటి విజయాన్ని అందుకున్నారన్నది ఇందులో హృద్యంగా చూపించారు.


# హరిహరవీరమల్లు ఆలస్యం.. అభిమానుల్లో అసహనం




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, నిధి అగర్వాల్ హీరోయిన్‌గా, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ చిత్రం పై అభిమానులు ఏ స్థాయిలో ఆశలు పెట్టుకున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఆ అంచనాలకు మేకర్స్ అనుగుణంగా స్పందించకపోవడంపై అభిమానుల్లో అసంతృప్తి పెరిగిపోతోంది. ఇప్పటికే చాలా కాలం క్రితమే షూటింగ్ పూర్తి అయినప్పటికీ, చిత్ర బృందం నుంచి సరైన అప్డేట్స్ లేకపోవడం అభిమానులకు తీవ్ర నిరాశ కలిగిస్తోంది. ముఖ్యంగా, ఈ వారం ట్రైలర్‌కు సంబంధించి అప్డేట్ వస్తుందని ప్రకటించినప్పటికీ, అది ఇప్పటివరకు విడుదల కాలేదు. వారం ముగియబోతున్నా కూడా కనీసం ఒక టీజర్, పోస్టర్, గ్లింప్స్ లాంటి ఏదైనా చిన్న హింట్ ఇవ్వకుండా, పూర్తిగా నిశ్శబ్దంగా ఉండిపోవడం వలన ఫ్యాన్స్ నిరాశకు లోనవుతు న్నారు. దీంతొ చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా కూడా ప్రమోషన్ పరంగా ఏమీ చేయకపోవడాన్ని అభిమానులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. సినిమా రిలీజ్‌ను మళ్లీ మళ్లీ వాయిదా వేయడమే కాదు, ఇప్పుడు ట్రైలర్ అప్డేట్స్ విషయంలో కూడా అజాగ్రత్తగా వ్యవహరించడం అభిమానులకు నిజమైన 'వర్స్ట్ ఎక్స్‌పీరియన్స్'గా మారుతోంది. ఇప్పటికే సినిమా ఎన్నోసారి వాయిదా పడింది. పవన్ కళ్యాణ్ షూటింగ్ పూర్తి చేసినప్పటికీ సినిమా విడుదలపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం, దానికి తోడు తాజా ట్రైలర్ అప్డేట్ విషయంలోనూ స్పష్టత లేకుండా మేకర్స్ వ్యవహరించడం వల్ల ఫ్యాన్స్ ఆగ్రహంగా ఉన్నారు. మొత్తంగా చూస్తే, 'హరిహర వీరమల్లు'పై ఉన్న హైప్‌ను సద్వినియోగం చేసుకోవడంలో చిత్రబృందం పూర్తిగా విఫలమైందని చెప్పాలి. ఎంత భారీ బ్జడెట్, స్టార్ కాస్ట్ ఉన్నా.. ఇలా అప్డేట్‌లు లేకుండా డిజప్పాయింట్ చేయడం అభిమానులకు నిజంగా బాధ కలిగించే విషయం.

# కీలకమైన సమయంలో ఇంపాక్ట్ చూపడంలో ఫెయిల్

**భారత్ బౌలింగ్ లైనప్‌పై మహ్మద్ షమీ ఆగ్రహం**




ఇండియా- ఇంగ్లాడ్ ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ ఓటమితో స్టార్ట్ చేసింది. హెడింగ్లీలో జరిగిన మొదటి టెస్టులో టీమ్ ఇండియా చిత్తుగా ఓడింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో 371 భారీ టార్గెట్‌ను కూడా భారత్ బౌలర్లు కాపాడుకోలేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ టార్గెట్ రీచ్ అయ్యేందుకు ఇంగ్లాండ్ బ్యాటర్లు 4.5 రన్ రేటుతో పరుగులు చేయడం గమనార్హం. భారత బౌలర్లు అవకాశాలు సృష్టించుకోవడంలో ఫెయిల్ అయ్యారు, చాలా విలువైన క్యాచ్‌లు డ్రాప్ చేసి నిరాశపరిచారు. తాజాగా మహ్మద్ షమీటీమ్ బౌలింగ్ సమస్యలపై తన అభిప్రాయాలను షేర్ చేసుకున్నాడు. జస్ప్రీత్ బుమ్రాఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు పడగొట్టి అద్భుత ప్రదర్శన చేశాడు. అయితే మిగిలిన బౌలింగ్ యూనిట్ అతనికి సపోర్ట్ ఇవ్వలేకపోయింది. ఇంగ్లాండ్ బ్యాటర్లు చాలా ఈజీగా రన్స్ స్కోర్ చేశారు. బౌలర్లకు ప్లానింగ్ లేదని, కీలకమైన సమయంలో ఇంపాక్ట్ చూపడంలో ఫెయిల్ అయ్యారని షమీ ఎత్తి చూపాడు.ఇతర బౌలర్లు బుమ్రాతో మాట్లాడి అతని నుంచి నేర్చుకోవాలి. వారు కలిసి ప్లాన్ చేయాలి, బుమ్రాకు సపోర్ట్ ఇవ్వాలి. అతడికి సరిగ్గా సపోర్ట్ చేస్తే, మనం మ్యాచ్‌లు ఈజీగా గెలవగలం. ఈ మొదటి టెస్ట్ తర్వాత బౌలింగ్‌పై కొంత వర్క్ చేయాల్సిన అవసరం ఉంది.' అని మహ్మద్ షమీ పేర్కొన్నాడు. ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో చెరో రెండు వికెట్లు తీసిన శార్దుల్ ఠాకూర్ , ప్రసిద్ధ్ కృష్ణను షమీ ప్రత్యేకంగా విమర్శించాడు. అయితే మ్యాచ్‌ను ప్రభావితం చేయడానికి వారి సహకారం చాలా ఆలస్యంగా అందిందని భావించాడు. 'శార్దుల్ ఆ వికెట్లు తీసుకునే సమయానికి, మ్యాచ్ మన చేతుల్లో లేదు. కొత్త బంతితో వికెట్లు తీయడం చాలా కీలకం. కానీ మనం చాలా ఈజీగా పరుగులు ఇచ్చేశాం. అందుకే ఇంగ్లాండ్ గెలిచింది.' అని చెప్పాడు. ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకురావడానికి, ఇండియాను మ్యాచ్‌లో టాప్‌లో ఉంచడానికి బుమ్రాకు ముఖ్యంగా ఇన్నింగ్స్ ప్రారంభంలోనే మంచి సపోర్ట్ అందించాలని షమీ తెలిపాడు. ఈ సిరీస్‌లో భారత జట్టు మరిన్ని సవాళ్లను ఎదుర్కోనుంది. టీమ్ స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఐదు టెస్ట్‌లలో మూడు మాత్రమే ఆడతాడు. ఇది ఇతర బౌలర్లపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. స్క్వాడ్‌లో అర్ష్‌దీప్ సింగ్, ఆకాష్ దీప్ వంటి రిజర్వ్‌డ్ ప్లేయర్స్ ఉన్నారు. కానీ వారు బుమ్రాను రీప్లేస్ చేయాలి, ఆ స్థాయిలో పర్ఫార్మ్ చేయాలి. ఇప్పుడు బుమ్రాకి రెండో టెస్ట్‌కి రెస్ట్ ఇచ్చారు. అతను లేకుండానే బర్మింగ్‌హామ్‌లో జులై 2న మొదలు కాబోతున్న రెండో టెస్ట్‌కి టీమ్ ఇండియా సిద్ధమవుతుంది. బుమ్రా లేకుండా భారత్ బౌలర్లు ఇంగ్లాండ్ బ్యాటర్లను ఎలా అడ్డుకుంటారనే చర్చలు మొదలయ్యాయి. ఈ మ్యాచ్‌లో భారత్ ఆధిపత్యం చెలాయించడం కష్టమని కొందరు ఎక్స్‌పర్ట్స్ విశ్లేషణలు వినిపిస్తున్నారు. షమీ సూచించినట్లు పక్కా ప్లానింగ్, ఎగ్జిక్యూషన్ లేకపోతే ఇంగ్లాండ్‌పై గెలవడం అంత ఈజీ కాదు.

# రెండో టెస్టులో టీమిండియాలో 3 భారీ మార్పులు!

**బుమ్రా, ఠాకూర్, జడేజాలను పక్కనపెట్టే అవకాశం**



ఇంగ్లండ్‌తో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్‌లో భారత ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా నుంచి కొందరు ఆటగాళ్లు అద్భుత ప్రదర్శన చేశారు. అదే సమయంలో, పేలవమైన ఫీల్డింగ్, కొందరు బ్యాటుతో విఫలమై తమ ప్రదర్శనతో చాలా నిరాశపరిచారు. రెండు టెస్టు కోసం టీమ్ ఇండియాలో 3 పెద్ద మార్పులు చూడవచ్చు. జస్ప్రీత్ బుమ్రాకు రెండవ మ్యాచ్‌లో విశ్రాంతి ఇవ్వవచ్చు. అతడిపై వరుస మ్యాచ్ ల ఓవర్ లోడ్ తో కీలకమైన మ్యాచ్ లతో అందుబాటులో ఉంటాడా లేదా అని మేనేజ్ మెంట్ భావిస్తోంది. బుమ్రాతో పాటు, జట్టులో మరో ఇద్దరు ఆటగాళ్లని ప్లేయింగ్-11 నుండి తప్పించవచ్చు. కానీ బుమ్రా లేకపోతే బౌలింగ్ అటాక్ కష్టమేనని వినిపిస్తోంది. భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో రెండో మ్యాచ్ జూలై 2 నుంచి ప్రారంభం కానుంది. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో ఈ మ్యాచ్ జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత 3 భారీ మార్పులతో దిగవచ్చు.బుమ్రా మొదటి మ్యాచ్‌లో అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఈ మ్యాచ్‌లో బుమ్రా 44 ఓవర్లు వేశాడు. బుమ్రా మొదటి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీశాడు. అతను భారతదేశం తరపున సక్సెస్‌ఫుల్ బౌలర్. కానీ బుమ్రాకు ఓవర్ బర్డెన్ దృష్టిలో ఉంచుకుని, టీమ్ ఇండియా అతనికి రెండవ టెస్ట్‌లో విశ్రాంతి ఇస్తుందని వినిపిస్తోంది. కానీ అతడు లేకపోతే భారత బౌలింగ్ అటాక్ బలహీనంగా మారి సిరీస్ లో ఇంగ్లాండ్ 2-0 ఆధిక్యంలోకి వెళ్తే కోలుకోవడం కష్టమే.టీమిండియా ఆల్ రౌండర్ శార్దూల్ ఠాకూర్‌ను జట్టు నుంచి తొలగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.. శార్దూల్ మొదటి మ్యాచ్‌లో తన ప్రదర్శనతో చాలా నిరాశపరిచాడు. శార్దూల్ బ్యాట్‌తో 2 ఇన్నింగ్స్‌లలో కేవలం 5 పరుగులు మాత్రమే చేశాడు. బౌలింగ్‌లో కూడా అంతగా రాణించలేదు. శార్దూల్ మ్యాచ్‌లో కేవలం 2 వికెట్లు మాత్రమే తీశాడు.సీనియర్ స్పిన్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజాను రెండో టెస్టుకు పక్కన పెట్టవచ్చు. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ జడేజా పెద్దగా రాణించలేదు. జడేజా ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 11 రన్స్, రెండో ఇన్నింగ్స్‌లో 25 పరుగులు చేశాడు. బౌలింగ్ లోనూ జడ్డూ నిరాశపరిచాడు. కేవలం ఒక వికెట్ మాత్రమే తీయగలిగాడు.

# తొలి టెస్ట్‌లో వెస్టిండీస్ పై ఆస్ట్రేలియా విజయం

**159 పరుగుల తేడాతో సూపర్ విక్టరీ**

వెస్టిండీస్ పర్యటనను ఆస్ట్రేలియా విజయంతో ప్రారంభించింది. బ్రిడ్జ్‌టౌన్ వేదికగా శుక్రవారం ముగిసిన తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియా 159 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆసీస్ నిర్దేశించిన 301 పరుగుల లక్ష్య ఛేదనలో వెస్టిండీస్ 141 పరుగులకే ఆలౌటైంది. షమార్ జోసెఫ్ టాప్ స్కోరర్‌గా నిలవగా.. జస్టిన్ గ్రీవ్స్(38), జాన్ క్యాంప్‌బెల్(23), కీసే కార్టీ(20) మాత్రమే డబుల్ డిజిట్ స్కోర్ చేశారు.మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో జోష్ హాజెల్ వుడ్(5/43) ఐదు వికెట్లతో విండీస్ పతనాన్ని శాసించాడు. నాథన్ లయన్ రెండు వికెట్లు తీయగా.. మిచెల్ స్టార్క్, ప్యాట్ కమిన్స్ చెరో వికెట్ తీసారు.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులకే ఆలౌటైంది. అనంతరం వెస్టిండీస్ 190 పరుగులు చేసింది. 10 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్.. రెండో ఇన్నింగ్స్‌లో 310 పరుగులు చేసింది. ట్రావిస్ హెడ్(61), బ్యూ వెబ్‌స్టర్(63), అలెక్స్ క్యారీ(65) హాఫ్ సెంచరీలతో రాణించారు. షమర్ జోసెఫ్(5/87) ఐదు వికెట్లు పడగొట్టాడు. అయితే ఈ మ్యాచ్‌లో థర్డ్ అంపైర్ తీసుకున్న నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. రెండు ఇన్నింగ్స్‌ల్లో హాఫ్ సెంచరీలు నమోదు చేసిన ట్రావిస్ హెడ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య రెండో టెస్ట్.. జూలై 3 నుంచి ప్రారంభం కానుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS,
6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL,
TELANGANA- 506001.PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313.
EDITOR: DHEEKONA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 7396206302, email: startrinethram28@gmail.com